# కథ

-టి.పి. హేమమాలిని

**"నాకో గాడిద కావాలండీ!" గిరిజ గారాంగా అడగగానే శేషతల్పశాయిలా తలకింద చేతినే తలగడగా చేసి పవళించిన పరాంకుశం ఉలిక్కిపడ్డాడు. సాయంత్రం నుంచి గిరిజ పోరుతూనే ఉంది తననొకటడగాలని. ఎప్పటిలాగే చీరో, చిన్న నగేమోననుకొని సరేనన్నాడు.**

**ఆమె కోరిక వినగానే ఆసరాగా చేసుకున్న మోచేతిలో ప్రకంపనలొచ్చి భంగిమకే భంగమొచ్చింది.**

''మీరు సరిగానే విన్నారండీ!'' తన కోరికను స్పష్టం చేసింది అతని స్పందనని చూసి.

చిత్ర విచిత్రమైన భావాలు ప్రతిబింబించింది పరాంకుశం ముఖారవిందం.

''నాకు గాడిద కొంటారా! కొనరా చెప్పండి'' రెట్టించింది గిరిజ.

''ఇదేం కోరిక గిరిజా! ఎవరైనా కుక్కల్ని పెంచుతారు. ఎలకల్ని పడుతుందని పిల్లుల్ని పోషిస్తారు. చిలుకల్ని పెంచి మాటలు నేర్పించి మురిసిపోతారు. ఇంకా ఓపిక ఉంటే ఆవును పెంచుకుంటారు. గోసేవ చేస్తే పుణ్యం, మంచి పాడి అనే పురుషార్థం దక్కుతాయి. అంతేకానీ ఇలా గాడిదల్ని పెంచుకోవాలనుకునేవాళ్లలో నువ్వే మొదటిదానివి'' విస్మయంగా అన్నాడు.

''ఇంతకీ నా గాడిద మాటేంటి?'' గట్టిగా అడిగింది.

గిరిజలో ఏ భావాన్నయినా సరే చాలా ఆనందంగా స్వీకరిస్తాడు. చిన్నప్పటి నుండీ కలిసి తిరిగి, పెరిగిన గిరిజన పరాంకుశం హృదయేశ్వరి. బొద్దుగా, ముద్దుగా ముద్దబంతిపువ్వులా ఉండే గిరిజ ఏమడిగినా కాదనలేని పరాంకుశం సంకటస్థితిలో పడ్డాడు.

''తను కాదనలేడని తెలిసే అడిగిందా?''

''గాడిద ఎందుకో చెప్పావు కాదురా!'' విషయం రాబట్టాలని బుజ్జగించి అడిగాడు. గిరిజ చెప్పడం ప్రారంభించింది.

ఇరవై నాలుగు గంటలు వెనక్కి వెళ్తే...

★ ★ ★

పరాంకుశం ఆఫీసుకి, పిల్లలు స్కూలుకి వెళ్లగానే పనంతా ముగించుకునేటప్పటికి పన్నెండయింది. ఏదో టి.వి.లో నిరంతరం వచ్చే లైవ్ షో చూడడానికి టీవీ ఆన్ చేసింది.

గిరిజ సహజంగా అందమైనదే. కానీ ఆ అందం నిలబడాలని మెరుగులు దిద్దుతూ ఉంటుంది. రకరకాల లేపనాలు, పేస్ట్‌లు ముఖానికి పట్టిస్తూ ఉంటుంది. అందంగా ఉండే ఆమెకి అవన్నీ అవసరం లేదని పరాంకుశం చెప్తున్నా పట్టించుకోదు గిరిజ.

## ఖర క్షీర ప్రహసనం

తెలిసినవే కాక టి.వి.లో చెప్పే చిట్కాలన్నీ తు.చ. తప్పక పాటిస్తుంది. అందుకే రోజూ పన్నెండు గంటలకి వచ్చే ''మహిళా! మేలుకో!'' ప్రోగ్రామ్ అస్సలు మిస్సవ్వదు.

టి.వి.లో కార్యక్రమం మొదలైంది. లంగరమ్మ (ఏంకర్‌కి తెలుగు అనువాదం) స్క్రీన్ మీద ప్రత్యక్షమైంది.

''హలో! ఎవరు మాట్లాడేది?''

''నేను గరివిడి నుండి గంగారాణిని మాట్లాడుతున్నానండీ!''

''మీరా గంగారాణిగారూ! ఎలా ఉన్నారండి? బావున్నారా?''

''బానే ఉన్నామండీ! నిన్నంతా మీరే గుర్తొచ్చారు'' గంగారాణి చెప్పింది.

''అంతా మీ అభిమానమండీ! ఇంతకీ నిన్న నేను ఎందుకు గుర్తొచ్చానండీ!'' యాంకర్ ఆనందం.

''నిన్న మా అన్నయ్యగారి పాప వచ్చిందండి! ఆ పాపకి మూడేళ్లు. తను మాట్లాడుతుంటే మీ మాటలే గుర్తొచ్చాయండీ!''

''చాలా థాంక్సండీ!'' (పాపని వచ్చీరాని ముద్దు మాటలు, ఈవిడని తెచ్చిపెట్టుకున్న ముద్దు మాటలు) గంగారాణిగారూ! మా రూల్ ప్రకారం కార్యక్రమానికి కాల్ చేసిన వాళ్లు అందానికి సంబంధించిన టిప్ అందించాలండీ!''

''ఆ! తప్పకుండానండీ. ఇప్పుడు నేను చెప్పబోయే చిట్కా వలన తప్పకుండా శరీర ఛాయ పెరుగుతుంది.''

''చెప్పండి మరి. మా ప్రేక్షకులంతా ఎదురు చూస్తున్నారు.''

''మామూలుగా ఆవు పాలు, గేదె పాలు అందరూ సౌందర్య సాధనంగా వాడతారు. కానీ గాడిద పాలతో ఒండ్రుమట్టిని రంగరించి శరీరానికి పట్టించి సున్నిపిండితో స్నానం చేస్తే చాలా మంచి రంగు వస్తామండీ!''

''గంగారాణిగారూ! మీరు చెప్పిన చిట్కా ఇప్పటివరకూ ఎవరూ చెప్పలేదండీ! కానీ ఇది జగమెరిగిన సంగతి. ఎందుకంటే, క్లియోపాత్ర రాణి గాడిద పాలతో స్నానం చేసేదంట. ఎనీహౌ! వండ్రఫుల్ టిప్ అందించారండీ! థాంక్యూ గంగారాణిగారూ!'' లైన్ కట్టయింది. ప్రకటనలు మొదలయ్యాయి.

గిరిజ బుర్ర నిండా గాడిద పాలు ఎలా సంపాదించాలన్న సమస్య అల్లుకుంది. గాడిద పాలతో మెరవబోయే తన చర్మసౌందర్యం గురించి తలచుకుంటే ఆమె ఒళ్లు పులకరించిపోయింది.

★ ★ ★

''ఇదండీ సంగతి! అందుకని మీరు అర్జెంటుగా గాడిదను తెచ్చే ప్రయత్నం చేయండి. ఏం? మీ గిరిజ అందంగా మెరిసిపోవడం మీకిష్టం లేదా?''

సున్నా విలువను కనిపెట్టిన ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞులు, దివి నుంచి చూసి అబ్బురపడేంత గుండ్రంగా చుట్టింది మూతిని.

ఆ నయాగారాలు చూస్తుంటే ఎక్కడో గుచ్చుకుంది పరాంకుశానికి.

''సరే చూద్దాంలే!'' మాయలేడిని కోరుకున్న మైథిలి మోజు తీర్చబోయే నీలమేఘశ్యాముడల్లే అభయమిచ్చాడు.

★ ★ ★

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

మాటైతే ఇచ్చాడుగానీ గాడిదను ఎక్కడ సంపాదించాలో అర్థం కాలేదు పరాంకుశానికి.

గార్దభాన్వేషణలో అతని బైక్‌కి దాహం ఎక్కువయింది. పర్స్‌కి ఒబేసిటీ ట్రీట్‌మెంట్ మొదలయింది.

ఒకానొక రోజు అతని అన్వేషణ ఫలించి ఒక రజక చక్రవర్తి ఎదురయ్యాడు. అతని వెంట ఒకటి కాదు రెండు కాదు నాలుగు గాడిదలు. పరికించి చూశాడు. అందులో ఒకటి పూర్ణగర్భిణి. అది తప్ప అన్నీ మూటలు మోస్తున్నాయి.

''ఆహా! ఏమి నా భాగ్యమూ...'' పాడుకున్నాడు తనలోనే.


ఆ మడివేలుని వెంబడించాడు.

అతడు సపరివారంగా రజకవాడలో ప్రవేశించాడు. ఈ రోజుల్లో కూడా గాడిద చాకిరీ చేయించేవారెవరున్నారు? తన అదృష్టంకొద్దీ వీడు దొరికాడు.

ఆ రజకుడు తన ఇంటి దగ్గర ఆగాడు. పరాంకుశం బైక్ దిగి అనుసరించాడు.

''ఎవరు కావాలి బాబూ!'' ఎగాదిగా చూస్తూ అడిగాడు.

''నువ్వే కావాలి!'' సినిమా టైటిల్‌లా తన్మయంతో చెప్పాడు.



''ఎందుకయ్యా?''

''నీతో పని పడింది.''

''చెప్పండి బాబూ! బట్టలుతకాలా? నెలకా? రోజూనా? బట్టలెక్కనిస్తారా? రేవు లెక్కనా! వంద బట్టలైతే తగ్గిస్తాను'' తన ధరల పట్టీ పరిచాడు.

''అందుకోసం కాదు'' నసిగాడు.

''ఇంటికొచ్చి బట్టలుతకాలా? మీ సబ్బు, పగుడరు, నీళ్లు ఎట్టి ఉతికారబెట్టైతే బట్టకి రూపాయ్'' మళ్లీ మొదలెట్టాడు.

''అబ్బ! అది కాదయ్యా మడివేలూ! నాకు... నాకో గాడిద కావాలి'' చెప్పేశాననుకుని ఊపిరి పీల్చుకున్నాడు.

జోక్ విన్నట్లు పకపకా నవ్వాడా రజకాగ్రేసరుడు.

''గాడిదా? గాడిద... మీకెందుకయ్యా?''

''నాకు పనుంది. నీ గాడిదని ఇవ్వు. డబ్బులిస్తాను.''

''ఇవ్వచ్చు గానండయ్యా! నాకవే ఆధారం మరి!''

''బాబ్బాబు! ఎలాగైనా ఇవ్వాలి'' కాళ్లు పట్టుకున్నంత పనిచేశాడు పరాంకుశం.

''ఓ పని సెయ్యండి బాబూ! గాడిద సూలుతో ఉంది. అది ఈనాక పట్టుకెళ్లండి'' జీవో పాస్ చేసినంత దర్పంగా చెప్పాడు.

''పోన్లే! నాకూ అదే కావాలి!''

ఓ పదిహేను రోజుల తర్వాత గార్దభ సమేతంగా ఇంటికొచ్చిన పరాంకుశాన్ని సాదరంగా స్వాగతించింది గిరిజ.

★ ★ ★

రోజూ ఉదయాన్నే గాడిద పాలు తీయాలని పరాంకుశానికి డ్యూటీ నిర్ణయించింది గిరిజ.

తను స్నానం చేసే నీళ్లలో సగంపైగా గాడిద పాలు ఉండాలన్న కోరిక ఆమెది.

ఓ శుభోదయాన...

పాలు తీయాలని గాడిద వెనక కాళ్ల దగ్గర కూచున్నాడు. పాలు పిండే ప్రయత్నంలో ఒక్కసారి కళ్లముందు నక్షత్రాలు కనిపించాయి. అప్పుడే చీకటి పడిందా అనుకున్న పరాంకుశానికి తెలిసింది అది గార్దభ ఘాతం అని.

మూతి ఒకవైపు ఎత్తుగా వాచిపోయింది.

''పాలేవీ?'' ఆనందంగా రాబోయిన గిరిజ, పరాంకుశం పరిస్థితి చూసి గాభరాపడింది. అతన్ని సేదతీర్చింది.

పరాంకుశం రజకుని దగ్గరకెళ్లి తన గోడంతా వెళ్లగక్కాడు.

''పిల్ల కోసం బెంగెట్టుకుందేమో బాబూ! దీన్ని కూడా తీసుకుపోండి.'' రజకుని సలహాతో ఖర కిశోరాన్ని కూడా వెంటబెట్టుకొచ్చాడు.

ఇప్పుడు గాడిదతోటే కాకుండా, గాడిద పిల్లతోటి కూడా అగచాట్లు మొదలయ్యాయి.

పాలు తీయాలని ప్రయత్నించేసరికి పిల్లగాడిద వచ్చేసేది. దాన్నో కొయ్యికి కట్టి వచ్చి పాలు కోసం కాళ్లు పట్టుకుంటే తల్లిగాడిద తన్నులు తప్పడం లేదు పరాంకుశానికి.

పట్టువదలని పరాంకుశంలా ప్రయత్నించి సఫలీకృతుడైనాడు.

గార్ధభ క్షీరంతో గిరిజ చర్మ సౌందర్యం పెరగడం మాట ఎలా ఉన్న అడపా దడపా పరాంకుశం పలువరుస పట్టు తప్పినట్లు అనిపిస్తోంది.

అయితే సమస్య కొత్త రూపంలో వచ్చింది. రాత్రివేళ గళమెత్తి ఆనందంగా గాడిద పెట్టే ఓండ్రలకు చుట్టు పక్కల ఇళ్లవాళ్ల నుంచి ఫిర్యాదులు మొదలయ్యాయి.

భార్యాభర్తలు ఆనందంగా ఒకటయ్యే వేళ, విద్యార్థులు చదువుకునే సమయంలో ఈ గార్ధభ రవాలు మొదలయి వారి మూడ్ మొత్తం పాడయ్యేది.

## ప్రేమలో పడిన ఛార్మి?

**గ్లామర్ స్టార్ ఛార్మి గత కొంత కాలంగా కొత్త తెలుగు సినిమాలు ఒప్పుకోకపోవడంపై రకరకాల కథలు వినిపిస్తున్నాయి. వాటి మాట ఎలా వున్నా తొందర్లోనే ఛార్మి పెళ్లి చేసుకుంటుందా? అనే సందేహాలు కూడా వెలిబుచ్చుతున్నారు సినీజనాలు. ఈమధ్య ఛార్మి తరచూ చెన్నయ్ వెళ్లొస్తోందిట. చెన్నయ్‌కి చెందిన ఓ యువ దర్శకుడితో ప్రేమాయణమే ఈ ట్రిప్పులకి కారణమంటున్నారు. ఈ వార్తలకి ఎలాంటి స్పందననూ తెలియచేయని ఛార్మి మాత్రం తమిళ, కన్నడ సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తోందని ఇంకొందరు చెబుతున్నారు. ఏ సంగతీ తొందర్లోనే తెలియకపోతుందా?**



అమ్మ పొత్తిళ్లలో హాయిగా వెచ్చగా బజ్జున్న పిల్లలు ఉలికిపడి లేచి మరి నిద్ర పోక తల్లులను సతాయించేవారు.

ఈ గోల భరించలేవంటూ అందరూ పరాంకుశానికి మొరపెట్టుకున్నారు.

మొదట్లో ఉన్న మర్యాద రాన్రాను పోయింది. త్వరగా ఈ గాడిద గోల వదిలించమనీ, లేకపోతే త్వరలోనే కాలనీ సెక్రటరీకి చెప్పి ఇల్లు ఖాళీ చేయించవలసి వస్తుందని వార్నింగిచ్చారు.

ఏదో పథకం ఆలోచించాలి. అయితే దానివలన గిరిజకు బాధ కలుగకూడదని నిర్ణయించుకున్నాడు.

★ ★ ★

''చెప్పండి. మీకేం సహాయం చేయగలను?'' కళ్లజోడు సవరించుకుంటూ ప్రశ్నించింది కలభాషిణి. కర్ణాటక సంగీత విద్వాంసురాలు అని తనని తాను భావించుకునే కళాకారిణి కావాలనుకునే ఓ కళాభిమాని.

''అది... అది...'' నసిగాడు పరాంకుశం.

''ఫర్వాలేదు చెప్పండి. అదెలాంటి విషయమైనా సరే!''

ఆమె ఇచ్చిన అభయ ముద్రతో తన కష్టాలన్నీ ఏకరువు పెట్టాడు. ఆమె ముఖం కూడా విచారభావాన్ని ప్రతిబింబించింది.

పరాంకుశం తన ప్లానంతా వివరించాడు.

అతను చెప్పిన సంగతి విని ఆమె కళ్లు ఆనందభాష్పాలని వర్షించాయి.

కళ్లజోడు తీసి చీరచెంగుతో తుడుచుకుంది.

''నా వలన ఇంతమందికి మేలు జరుగుతుందంటే తప్పకుండా చేస్తాను. మీరేం బెంగ పెట్టుకోవద్దు. ఇంతకీ నేను కచేరీ ఎక్కడ చెయ్యాలి?'' వడ్డికాసులవాడి వరద హస్తంలా గోచరించింది ఆమె చేయి.

''అబ్బెబ్బే! మీరు కచేరీ ప్రత్యక్షంగా ఇవ్వనక్కరలేదండీ! (కాలనీ జనాలు జడుసుకుంటారు)'' అంటూ తన ఉద్దేశ్యం విడమర్చి చెప్పాడు.

''ఉండండి. వస్తాను'' అని లోపలికెళ్లి కొంతసేపటి తర్వాత వచ్చింది.

''తీసుకోండి'' అంటూ తన చేతిలోని పాకెట్‌ని అందించింది.

గుళ్లో తీర్థప్రసాదాలు పుచ్చుకున్నంత భక్తిగా అందుకున్నాడు.

''వస్తాను. నాకీ మేలు జరిగితే మీకు సన్మానం చేస్తానమ్మా!'' అంటూ అక్కడ నుండి బయట పడ్డాడు.

★ ★ ★

రాత్రి భోజనాలైన తర్వాత నిద్రకుపక్రమించారు. పరాంకుశం ఏం పుణ్యం చేసుకున్నాడో గానీ గిరిజకు అర్ధరాత్రి వరకు సీరియల్స్ చూసే అలవాటు లేదు. చక్కగా సరియైన వేళకు పడుకుంటారు. అందుకే గిరిజ అందం పాడవ్వలేదు.

పిల్లలు పడుకున్నారు. గిరిజ కూడా మంచి

నిద్రలో ఉంది. పరాంకుశం లేచి మెల్లగా బయటకి నడిచాడు.

ఇంటిముందు కట్టేసిన గాడిద దగ్గరకెళ్లాడు. మెల్లగా తన చేతిలోని కవర్ తీశాడు. ఫిక్స్ చేయాల్సినదంతా చేసి మళ్లీ ఇంట్లోకొచ్చాడు.

కొంత సమయం తర్వాత...

''ఓ...ఓ...ఓ...'' రకరకాల స్థాయిలలో గార్దభ స్వరం విన్పించసాగింది.

మెల్లగా వెళ్లి మళ్లీ లోపలికొచ్చాడు. కొంతసేపటి తర్వాత మళ్లీ పెరట్లోకెళ్లాడు.

మళ్లీ...

''ఓ...ఓ...ఓ...'' ఖర ఓండ్ర రవాలు పిక్కటిల్లాయి.

ఇలా రెండు మూడుసార్లు ఇంట్లోకీ, పెరట్లోకీ తిరిగాడు.

నెమ్మదిగా మంచం మీదకి చేరాడు.

పిచ్చెక్కినట్లు గాడిద అలా ఓండ్ర పెడుతూనే ఉంది.

గిరిజకి మెలకువ వచ్చింది. అదే సమయంలో ఇంటి తలుపులు తబదబా బారిన చప్పుడు, తలుపు తీస్తే..

కాలనీ వాసులంతా కట్టకట్టుకుని వచ్చారు.

''మీరు గాడిదని పంపేస్తారా? ఇల్లు ఖాళీ చేస్తారా? మమ్మల్ని యాక్షన్ తీసుకోమంటారా?'' ఉగ్రరూపం దాల్చారు.

''ఏంటండీ! దబాయిస్తారేంటి? మా ఇష్టం. గాడిదనో, గుర్రాన్నో పెంచుకుంటాం. మీకెందుకు?'' గంభీరంగా అడగబోయింది గిరిజ.

''అలా అయితే కుదరదమ్మా! నలుగురిలో ఉన్నప్పుడు ఆ నలుగురికీ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. కంటి నిండా నిద్రపోయి ఎన్నాళ్లయింది! సరిగ్గా నిద్రపట్టేవేళ ఈ గాడిద గోలొకటి'' కాలనీ సెక్రటరీ అయిన పెద్దాయన కొంచెం గట్టిగానే మాట్లాడాడు.

''మంచి మూడ్‌లో ఉన్నవేళ ఈ గాడిద గోలతో మూడంతా పోతోంది'' గోణిగాడు కొత్త పెళ్లికొడుకు.

''రేపటిలోగా ఆ గాడిదకి ఉద్వాసన చెప్పండి లేదా, కొత్తిల్లు వెతుక్కోండి'' గట్టిగా చెప్పేసి వెళ్లిపోయారు.

చిన్నబోయిన మొహంతో లోపలికి నడిచింది గిరిజ.

★ ★ ★

మర్నాడు రాత్రి కూడా సేమ్ సీన్. ఎక్విప్‌మెంటంతా ఫిక్స్ చేసి వచ్చిన పరాంకుశం మరి వెళ్లలేదు. గాడిద అరుపులు ప్రతిధ్వనిస్తున్నాయి. అవి ఆనందంతో చేస్తున్నవా? లేక బాధ తట్టుకోలేక పెడుతున్నవా?

కాలనీ జనాలంతా చేతికేది దొరికితే దాంతో వచ్చేస్తున్నారు. గాడిద దృష్టిలో పడిందది.

అంతే! కట్టుకొయ్య చుట్టూ తిరుగుతూ తప్పించుకోవడానికి ప్రయత్నించసాగింది. మెల్లగా గాడిద దగ్గరకెళ్లి తన ఎక్విప్‌మెంట్ తీసేశాడు. గాడిద ప్రయత్నం ఫలించి తాడు తెంచుకుని పరుగో పరుగు. దాని వెనుక పిల్లగాడిద పరుగు లంకించింది.

★ ★ ★

కలభాషిణికి కలనేత పట్టుచీర, జాకెట్టు భక్తిగా సమర్పించుకుంటూ చెప్పాడు పరాంకుశం.

''మీరు సమయానికి మీ కేసెట్స్ ఇచ్చి నా గండం గట్టెక్కించారు. లేదంటే చాలా ఇబ్బంది పడిపోయేవాడిని.''

''ఇంతకీ ఏం చేశారు?'' కుతూహలంగా ప్రశ్నించింది.

''మీ కేసెట్స్‌ని వాక్‌మెన్‌లో పెట్టి, అది దాని మెడలో వేలాడదీశాను. ఇయర్ ఫోన్స్ దాని చెవుల్లో పెట్టాను.

మీ గోత్ర సౌలభ్యం దానికి అభిమానాన్ని కలిగించింది. గొంతు కలపాలని ఆశించింది.

మీ గానమాధుర్యం వినే 'భాగ్యం' మరెవరికీ దక్కనివ్వలేదు. నా పథకం ఫలించింది. సత్ఫలితాన్నిచ్చింది.

మీ గళం దానికి స్వజాతి అభిమానాన్నే గాదు, యాచకో యాచక శత్రుః అన్నట్లు వ్యతిరేకతను కూడా కలిగించింది.

అక్కడే ఉంటే దాన్ని ఇంకా బాధిస్తానేమోనని పుంజాలు తెంపుకుని మరీ పరుగెట్టింది'' వివరించాడు.

★ ★ ★

''ఏమండీ! ఏనుగు దంతాన్ని పులి పాలతో అరగదీసి రాసుకుంటే మొటిమలు, మచ్చలు పోతాయట...'' చెప్పుకుపోతున్న గిరిజ మాటలు అసలు విననట్లు నటించాడు మొదటిసారిగా పరాంకుశం.

☆

## కవయిత్రిగా భూమిక

**హిందీ, తెలుగు చిత్రాల్లో తనదైన గుర్తింపు కలిగిన భూమిక ఓ కొత్త అవతారం దాలుస్తోంది. కవితల్రాయడం షురూ జేసిందిట. అది కూడా ఇంగ్లీషులోనే నండీ. ఇప్పటికి వంద కవితలు వరకూ రాసిపారేసిందిట. వీటన్నింటినీ ఓ సంకలనంగా ప్రచురించి ఆ గ్రంథాన్ని తన అభిమాన నటుడు అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా ఆవిష్కరించాలనుకుంటున్నట్టు తన మనసులోని మాట చెబుతోంది.**

